క్లుప్తంగా

ఇస్కాన్‌లో వైభవంగా పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజలు వైభవంగా నిర్వహించారు. శ్రీ రాధాదామోదరులను ప్రత్యేకంగా అలంకరించిన అనంతరం పూజలు చేశారు. హరే రామ హరే కృష్ణ కీర్తనలు, అభిషేకాలు, పుష్పాభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

అనాథాశ్రమం పిల్లలకు భోజనం ఏర్పాటు



భోజనం అందజేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

ఆనందపురం : మండలంలోని బోయిపాలెంలో ఉన్న మెర్సీ ఫౌండేషన్ అనాథాశ్రమం పిల్లలకు ఆదివారం జై జవాన్ ఫౌండేషన్ ప్రతినిధులు మధ్యాహ్న భోజనం అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కుప్ప రాజశేఖర్ మాట్లాడుతూ మొదటి వార్షికోత్సవం సందర్భంగా పేదలకు, వృద్ధులకు ఆహారం అందజేసినట్టు చెప్పారు. సంస్థ తరపున వివిధ ప్రాంతాల్లో రోడ్డు పక్కన ఉన్న పేదలకు ఆహార పొట్లాలు అందజేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ ముడసల శ్రీను, కార్యదర్శి కార్తీక్, కోశాధికారి కుప్ప రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భారీ వాహనాలతో రోడ్డు శిథిలం



పీఎం పాలెం బాబా ఇంజినీరింగ్ కళాశాల మార్గంలో శిథిలమైన రోడ్డు

తగరపువలస: జీవీఎంసీ మధురవాడ జోన్ పీఎం పాలెం చివరి బస్టాప్ నుంచి బాబా ఇంజినీరింగ్ కళాశాలకు వెళ్లే రహదారి పలుచోట్ల శిథిలమైపోయింది. ఈ రహదారిలో భారీ వాహనాల రాకపోకలతో మిగిలిన వాహనాలు నడిచేందుకుగా అనువుగా లేకుండా పోయింది. తక్షణమే నాణ్యమైన మెటీరియల్‌తో మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

వైభవంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు స్వర్ణ పుష్పార్చన ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అలంకరించి కల్యాణమండపంలోని వేదికపై అధిష్ఠింపజేశారు. 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తర శతనామావళి నిర్వహించి హారతులు అందజేశారు. అర్చకులు సాతులూరి నరసింహాచార్యులు, అప్పాజీ సేవని నిర్వహించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ కనకరాజు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కమనీయం నిత్యకల్యాణం

వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్య కల్యాణం కమనీయంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠంపజేసి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

ఆరు లైన్లతో మారనున్న ముఖచిత్రం



ఆరు లైన్ల రహదారిగా మారనున్న భీమిలి ఎస్‌వోఎస్ వద్ద రోడ్డు



ప్రస్తుతం తగరపువలస వద్ద ఆరు లైన్ల రహదారి

- భీమిలికి ఇరువైపులా ఆరు లైన్ల రహదారులు
- ఇప్పటికే గోస్తనీ నది మీదుగా 16వ నంబరు జాతీయ రహదారి
- త్వరలో విశాఖ – భోగాపురం మధ్య రూ.6300 కోట్లతో రోడ్డు
- ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో కేంద్ర మంత్రి ప్రకటనతో సర్వత్రా హర్షం

తగరపువలస: విశాఖ – భోగాపురం మధ్య ఆరు లైన్ల రహదారి ప్రకటనతో భీమిలి వాసులు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే భీమిలి నియోజకవర్గంలో 16వ నంబర్ జాతీయ రహదారి తగరపువలస గోస్తనీనది మీదుగా ఆరు లైన్లలో విస్తరించి ఉంది. శుక్రవారం నగరంలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ – 2023లో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ మాట్లాడుతూ విశాఖ – భోగాపురం మధ్య 55 కిలోమీటర్ల పరిధిలో రూ.6,300 కోట్లతో ఆరు లైన్ల రహదారి నిర్మించనున్నట్టు ప్రకటించారు. ఇదే జరిగితే భీమిలి నియోజకవర్గం చుట్టూ రెండు ఆరు లైన్ల రహదారులు ఉండబోతున్నాయి. 16వ నంబరు జాతీయ రహదారి ఎండాడ, మధురవాడ, ఆనందపురం, తగరపువలస మీదుగా ఉండగా... దీనినే మరొకవైపు పెందుర్తి మీదుగా తగరపువలస వైపు కూడా విస్తరించారు. కేంద్ర మంత్రి గడ్కరీ ప్రకటించిన నూతన ఆరు లైన్ల రహదారి విశాఖ బీచ్ రోడ్డు మీదుగా ప్రారంభమై భీమిలి ఎస్‌వోఎస్, గొల్లలపాలెం రెండు కొండల మధ్య నుంచి మామిడిపాలెం, రేఖవానిపాలెం, కొత్త మూలకుద్దు గోస్తనీనది మీద నుంచి పెదనాగమయ్యపాలెం తీరం నుంచి భోగాపురం మండలం తూడెం పంచాయతీ మీదుగా భోగాపురం ఎయిర్‌పోర్ట్ వరకు నిర్మించనున్నారు.



ఆరు లైన్ల రహదారి నిర్మించనున్న మూలకుద్దు వద్ద గోస్తనీ నది ప్రాంతం

విస్తారంగా పెరగనున్న అవకాశాలు

ఇప్పటికే 16వ నంబరు జాతీయ రహదారి పొడవునా పరిశ్రమలు విస్తరించి ఉండటంతో రవాణా, బ్యాంకింగ్ వసతులు మెరుగై ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరిగాయి. విద్యా, వైద్యం, రవాణా, ఐటీ, వ్యవసాయ, మత్స్య, అటవీ పరిశ్రమలతో పాటు వాటి అనుబంధ పరిశ్రమలు ఊపందుకున్నాయి. ఇప్పుడు తీరప్రాంతంలో మరో ఆరు లైన్ల రహదారి నిర్మాణంతో భీమిలి, విశాఖతోపాటు ఉత్తరాంధ్ర అభివృద్ధికి దోహదం కానుంది. విశాఖలో జల, వాయు, రైలు రవాణాకు కూడా అవకాశం ఉండటంతో ఎగుమతి, దిగుమతులకు ప్రాధాన్యత పెరిగింది.

అభివృద్ధి పరుగులు



పరిపాలన రాజధానిగా విశాఖ ముమ్మాటికీ బెస్ట్ అంటూ గ్లోబల్ సమ్మిట్‌కు వచ్చిన వివిధ రాష్ట్రాల, దేశాల ప్రతినిధులు రుజువు చేశారు. సీఎం జగన్ ఆలోచన నుంచి వచ్చిన ఆరు లైన్ల రహదారితో ఉత్తరాంధ్రలో అభివృద్ధి పరుగులు పెడుతుంది.

– జీరు వెంకటరెడ్డి, ఇంటక్ నాయకుడు, చిట్టివలస

ఉత్తరాంధ్ర స్వరూపమే మారిపోతుంది

ఆరు లైన్ల రహదారులతో ఉత్తరాంధ్ర ముఖ స్వరూపమే మారనుంది. అభివృద్ధి కార్యక్రమాలు మరింత పుంజుకోనున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పట్టుదలతో ఈ ఆరు లైన్ల రహదారులు దేశాభివృద్ధిలో భాగం కానున్నాయి. ముందుచూపున్న ముఖ్యమంత్రిగా జగన్ గ్లోబల్ సమ్మిట్‌లో వ్యాపారవేత్తల మన్ననలు అందుకున్నారు.

– ముత్తంశెట్టి శ్రీనివాసరావు, భీమిలి ఎమ్మెల్యే

అనంతుని రథోత్సవం నేడు



అనంతుని ఉత్సవ విగ్రహాలు

పద్మనాభం: పద్మనాభంలో వెలసిన కుంతీ మాధవ స్వామి ఆలయంలో జరుగుతున్న అనంతుని కల్యాణోత్సవాల్లో భాగంగా ఐదో రోజైన సోమవారం రాత్రి రథోత్సవం కనుల పండువగా నిర్వహించనున్నారు. ముందుగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం అనంతరం రాత్రి పది గంటలకు శ్రీదేవి భూదేవి సమేత అనంతుని ఉత్సవ విగ్రహాలను రథం పైకి తోడ్కొని వస్తారు. విశేష పూజల తర్వాత రాత్రి 11 గంటలకు గాలి గోపురం వద్ద రథోత్సవం ప్రారంభమవుతుంది. కృష్ణాపురం గ్రామానికి చెందిన మొకర, సుంకర, పద్మనాభం, అర్చకునిపాలెం గ్రామాలకు చెందిన తాలాడ, ఇసకలపాలెం గ్రామానికి చెందిన కుంటుబోతు వారి కుటుంబ సభ్యులతో పాటు భక్తజనం రథయాత్ర నిర్వహిస్తారు.

పెరిగిన పర్యాటకుల తాకిడి

కొమ్మాది: ఎండలు విజృంభిస్తున్న తరుణంలో తీరంలో పర్యాటకుల సందడి పెరిగింది. సాగర్‌నగర్ బీచ్, రుషికొండ బీచ్, రామానాయుడు ఫిల్మ్ స్టూడియో, తొట్లకొండ, ఎర్రమట్టి దిబ్బలు, భీమిలి బీచ్‌కు ఆదివారం పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వేసవి తాపం నుంచి ఉపశమనం కోసం సముద్ర స్నానాలు చేశారు.

కొలిక్కిరాని రూ.30కోట్ల కుచ్చుటోపీ వ్యవహారం

ఇప్పటికీ పరారీలోనే ఇద్దరు చీటీల నిర్వాహకులు



తాటితూరులో 2022 అక్టోబర్‌లో ఆందోళన చేస్తున్న బాధితులు

తగరపువలస: భీమిలి మండలం తాటితూరులో శ్రీదేవి, రమాదేవి, నూకరత్నం అనే ముగ్గురు మహిళలు వందలాది మంది గ్రామస్తులను చీటీల పేరుతో వంచించి నాలుగున్నర నెలల క్రితం రూ.30 కోట్లకు కుచ్చుటోపీ పెట్టారు. ఈ ముగ్గురిలో ఒక మహిళ ప్రస్తుతం తాటితూరులోనే ఉండగా మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. ఈ వ్యవహారం నేటికీ కొలిక్కి రాలేదు. నెలవారీ చీటీలు, దసరా, సంక్రాంతి, వరలక్ష్మి వ్రతం చీటీలు, లక్కీ డ్రా పేరుతో వందలాది మంది నుంచి ముగ్గురు మహిళలూ డబ్బులు వసూలు చేశారు. స్థానికంగా ఉండే మరికొందరు మహిళలను ఏజెంట్లుగా నియమించుకుని చీటీలు పాడుకున్న వారికి డబ్బులు వెనక్కు ఇవ్వకుండా వారి వద్దే ఉంచుకునేవారు. ఇలా కోట్లాది రూపాయలతో ఆ ముగ్గురు మహిళలు ఆస్తులు కూడబెట్టారు. ఈ క్రమంలో మోసపోయామని గ్రహించిన గ్రామస్తులు 2022 అక్టోబర్‌లో గ్రామంలోని రచ్చబండ వద్ద ఆందోళనకు దిగారు. దీంతో కొందరు గ్రామపెద్దలు నిందితుల నుంచి డబ్బులు వసూలు చేసి సమస్య పరిష్కరిస్తామని నచ్చచెప్పారు. ఇది జరిగి నాలుగున్నర నెలలు అవుతున్నా సమస్య పరిష్కారం కాలేదు. ఈలోగా మధ్యవర్తులుగా ఉన్న మహిళలపై అప్పులు ఇచ్చిన వారు ఒత్తిడి చేస్తూ దూషణలు, దాడులకు దిగుతున్నారు. ఈ వేధింపులు తాళలేని వెంకటలక్ష్మి అనే మహిళ మాట్లాడుతూ తాను మధ్యలో ఉండి ముగ్గురు చీటీల నిర్వాహకులకు రూ.89 లక్షలు ఇచ్చానని... వారు ఇప్పుడు ముఖం చాటేయడంతో తనతో పాటు తన కుటుంబం ఆత్మహత్య చేసుకునే పరిస్థితి నెలకొందని వాపోయింది. భీమిలి పోలీసులు, పంచాయతీ పెద్దలు తమకు న్యాయం చేయాలని వేడుకుంటోంది.

రెచ్చిపోతున్న జీవీఎంసీ రెవెన్యూ సిబ్బంది

తగరపువలస: జీవీఎంసీ రెవెన్యూ సిబ్బంది భీమిలి గృహ యాజమానులను బెదిరించి, పీడించి డబ్బుల వసూళ్లకు పాల్పడుతున్నారు. వ్యాపార అవసరాలకు ఇళ్లు అద్దెకు ఇచ్చారంటూ బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడుతూ అమాంతం పన్నులు పెంచుతామంటూ బేరాలు పెట్టుకుంటున్నారు. అడిగినంత మొత్తం ఇవ్వకపోతే పన్నులు మూడు నుంచి అయిదు రెట్లు పెంచుతామని హెచ్చరిస్తున్నారు. మళ్లీ మళ్లీ గృహ యాజమానుల చుట్టూ తిరుగుతూ బేరసారాలకు దిగుతున్నారు. ఇటీవల తగరపువలసకు చెందిన ఒక వ్యాపారిని బెదిరించి గృహ సంబంధమైన పన్ను చెల్లిస్తూ వ్యాపార అవసరాలకు అద్దెకు ఇచ్చారంటూ రూ.30 వేలు డిమాండ్ చేశారు. రెండు రోజుల బేరసారాల అనంతరం రూ.15వేలతో సర్దుకున్నారు. వీరికి ఒక మహిళతో పాటు మరో ముగ్గురు లోకల్ సిబ్బంది సహకరిస్తున్నారు. బాధితుడైన వ్యాపారి మాట్లాడుతూ భీమిలి జోన్‌లో రూ.4 కోట్ల విలువైన పన్నులు చెల్లించాల్సిన రెండు కార్పొరేట్ సంస్థల నుంచి రెవెన్యూ సిబ్బంది రూ.20 లక్షలు లంచం తీసుకుని రూ.68 లక్షల పన్ను మాత్రమే కట్టించుకున్నారని ఆరోపించారు.

ఈ ఏడాది మరో 10 శాతం మాత్రమే పెంచి ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టారన్నారు. దీనిపై భీమిలి రెవెన్యూ సిబ్బందిపై ఆధారాలతో విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్టు ఆయన తెలిపారు.

అన్ని రంగాల్లో మహిళలు రాణించాలి



బాలికలకు బహుమతులు అందజేస్తున్న యూనియన్ ప్రతినిధులు



జ్యోతి వెలిగిస్తున్న వనితా వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

పీఎం పాలెం: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పీఎం పాలెంలోని మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక తులసీ పార్కులో ఆదివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. వివిధ రంగాల్లో సేవలు అందించిన మహిళలను సత్కరించారు.

అనంతరం వక్తలు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో పురుషులకు దీటుగా రాణించడం గర్వంగా ఉందన్నారు. మరింత ప్రగతి సాధించడానికి మహిళా లోకం నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వన్ జీరో వన్ గవర్నర్ శుభ, లక్ష్మీ రెడ్డి, వనితా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు దాసరి రాజేశ్వరి, క్లబ్ కార్యదర్శి అపర్ణ, ఉపాధ్యక్షురాలు జ్యోతికమల, రాధారాణి, అపర్ణ, కె.లక్ష్మి, రత్నమాల పాల్గొన్నారు.

అంధ బాలికల పాఠశాలలో...

కొమ్మాది: సాగర్‌నగర్ ప్రభుత్వ అంధ బాలికల ఆశ్రమ పాఠశాలలో విశాఖపట్నం కో – ఆపరేటివ్ బ్యాంక్ మహిళా అధికారులు, బ్యాంకు ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్రీడా పోటీలు, వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బ్యాంక్ డైరెక్టర్ భవాని తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణాలకు రక్ష



రక్తదాన శిబిరంలో ఏసీపీ వివేకానంద తదితరులు

భీమునిపట్నం: రక్తదానం చేయడం ద్వారా పలువురి ప్రాణాలు కాపాడవచ్చని ఎండాడ దిశ పోలీస్ స్టేషన్ ఏసీపీ సీహెచ్.వివేకానంద అన్నారు. స్థానిక కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనేక ప్రమాదాల్లో గాయపడేవారితోపాటు కొంతమంది రోగులకు రక్తం అవసరం ఎంతో ఉంటుందన్నారు. అటువంటి వారికి సమయానికి దొరక్కపోతే ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఉంటుందన్నారు. ఇటువంటి శిబిరాల ద్వారా రక్తాన్ని సేకరించడం ఎంతో అవసరమన్నారు. రక్తదానం చేసేందుకు అందరూ ముందుకు రావాలని కోరారు. ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ శిబిరంలో 80 మంది రక్తదానం చేశారని తెలిపారు. ఫౌండేషన్ ప్రతినిధులు కె.ఎస్.ఎన్.మూర్తి, కె.భానోజీరావు, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జోరుగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



ఎండాడలో ప్రచారం చేస్తున్న నాయకులు

కొమ్మాది: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల విజయం కోసం నాయకులు, కార్యకర్తలు ఆదివారం ప్రచారం ముమ్మరం చేశారు. జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ బీసీ కాలనీ, ఎస్సీ కాలనీల్లో వైఎస్సార్ సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కార్పొరేటర్ లొడగల అప్పారావు ప్రచారం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు గుడ్ల పోలిరెడ్డి, మాదు చంటి, బుజ్జి, రాజేశ్వరి, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

- జీవీఎంసీ 4వ వార్డు నిడిగట్టు, జేవీ అగ్రహారం, నేరెళ్లవలస ప్రాంతాల్లో కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని ఓటర్లను కోరారు.

సీతంరాజు సుధాకర్‌కి మద్దతుగా ప్రచారం

మధురవాడ: వైఎస్సార్‌సీపీ బలపరచిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కి మద్దతుగా ఆదివారం సాయంత్రం జీవీఎంసీ 7వ వార్డులో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. చంద్రంపాలెం కాలనీ పరిసర ప్రాంతాల్లో గ్రాడ్యుయేట్స్ ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. బ్యాలెట్‌లో సుధాకర్ పేరు ఎదురుగా 1వ నంబర్ వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు, సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుడు పీకేఎమ్ పాత్రుడు, నాయకులు పిళ్లా సూరిబాబు, పీస రామారావు, జగ్గుపిల్లి అప్పారావు, పోతిన జోగి, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

జీవో 24 అమలులో చిత్తశుద్ధి అవసరం



మాట్లాడుతున్న వీసీ సత్యనారాయణ

సీతంపేట: ప్రైవేట్, ఎయిడెడ్ స్కూళ్లలో ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశం కోసం పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయించాలని ప్రభుత్వం విడుదల చేసిన జీవో నంబర్ 24పై స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. జీవో 24పై స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో బాలవికాస్ ఫౌండేషన్, రైట్ టు ఎడ్యుకేషన్ ఫోరం సంయుక్తంగా ఆదివారం బీవీకే కళాశాలలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దామోదర సంజీవయ్య లా యూనివర్సిటీ వ్యవస్థాపక వీసీ వై.సత్యనారాయణ మాట్లాడుతూ జీవో నంబర్ 24 అమలులో చిత్తశుద్ధి అవసరమన్నారు. విద్యా హక్కు చట్టం అమలులో ప్రభుత్వంతోపాటు టీచర్లు తమ వంతు పాత్ర పోషించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో హాజరు తక్కువై డ్రాప్ అవుట్స్ ఉన్న నేపథ్యంలో ఈ అంశంపై కూడా దృష్టి సారించాలని కోరారు. జీవో అమలులో లోపాలను స్వచ్ఛంద సంస్థలు ప్రభుత్వం దృష్టికి తేవాలన్నారు. సంస్థ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ విద్యా హక్కు చట్టం అమలు చేయడంలో ప్రభుత్వం చురుగ్గా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. అమ్మ ఒడి, గోరుముద్ద, విద్యా కానుక వంటి పథకాలు అందులో భాగమేనన్నారు. పూర్తి స్థాయిలో చట్టాన్ని అమలు చేయాలని కోరారు. సమావేశంలో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు గౌరీ శంకర్, అబ్దుల్ బేగ్, నరసింహారావు, హరగోపాల్, మధుసూదనరావు పాల్గొన్నారు.

ఖైదీలకు దంత పరీక్షలు

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారంలో సీఐఐ యంగ్ ఇండియన్ విశాఖపట్నం చాప్టర్, గీతం దంత కళాశాల ఆధ్వర్యంలో 'నేషనల్ కాన్స్–ఎండో డే'సందర్భంగా ఆదివారం దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో గీతం దంత వైద్యులు సుమారు 200 మంది ఖైదీలకు దంత పరీక్షలు చేశారు. అవసరైన వారికి మందులు, టూత్ పేస్టులు అందజేశారు. ఈ సందర్భంగా వైద్యులు నోటి ఆరోగ్యం, దంత సంరక్షణపై ఖైదీలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గీతం దంత కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.ఎస్.రాజు, జైల్ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయక సమస్య గ్రంథంతో రైతులకు ఊరట



గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

బీచ్ రోడ్డు: రైతులకు ఎదురవుతున్న సమస్యల పరిష్కారం కోసం క్లార్ కౌట్స్కీ రచించిన వ్యవసాయక సమస్య గ్రంథం ఎంతో ఊరటనిస్తోందని పరిశోధకుడు విద్యాసాగర్ అన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో వ్యవసాయక సమస్య తెలుగు అనువాద గ్రంథ ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయాన్ని మరింతగా అభివృద్ధి చేయడం అనేది ఆధునిక రాజ్యం లక్షణమని, అందుకు జలయజ్ఞమే ఓ ఉదాహరణ అని చెప్పారు. వ్యవసాయం ఒకసారి పెట్టుబడిదారీ వలయంలో చేరుకున్న తర్వాత రైతు శ్రమని రైతు ఉపయోగించుకోలేని పరిస్థితిని సృష్టిస్తుందన్నారు. మరో వక్త జగన్నాథస్వామి మాట్లాడుతూ కార్మిక వర్గంతో చిన్న రైతు కలసి ప్రయాణం చేయడం ద్వారా మాత్రమే సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. రైతుల ఆత్మహత్యలకు సామాజికవేత్తలతో పాటు విద్యార్థులు కూడా శాస్త్రీయ పరిష్కారం కనుగొనాలంటే ఈ గ్రంథం తోడ్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కె.కృష్ణయ్య, బి.రామానాయుడు, రాజగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన


నా క్లయింటు అయిన శ్రీ మండ ప్రసాద రావు, నివాసం : విశాఖపట్నం, శాంతి నగర్, ఎస్.ఏ.డి కొత్త రోడ్డు, డోరు నెం. 58-15-114/68రు యిచ్చిన భోగట్టా ప్రకారం ఇందుమూలంగా యావన్మంది ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా నా క్లయింటు గారు విశాఖపట్నం జిల్లా, విశాఖపట్నం బస్తీ, ఎండాడ గ్రామం, డోరు నెం. 3-438/2, ఫ్లాట్ నెం. 304, MVV Harmony Apartments, సర్వే నెం. 40 మరియు 41/2 గల స్థిరాస్తి శ్రీ Kalla Yadagiri Lakshmi Narasimha Murthy వద్ద నుండి ఆస్తిని కొనుగోలు చేయుటకు నిర్ణయించుకొని క్రయ అగ్రిమెంటు వ్రాసుకొనుటకు నిర్ణయించుకొని ఈ స్థిరాస్తిపై ఎటువంటి లావాదేవీలు అనగా తనఖాలు గాని, బ్యాంకు లోనులు గాని, బ్యాంకు గ్యారంటీలు గాని, పార్టీషన్లు గాని, మరియు ఏ ఇతరాత్ర లావాదేవీలు లేవని నమ్మి క్రయ పురోజీ చేయించుకొనుటకు నిర్ణయించుకొని యున్నాము. ఈ పై తెలిపిన స్థిరాస్తికి ఎటువంటి అభ్యంతరములు, లావాదేవీలు యున్న యెడల ఈ ప్రకటన తేది నుండి 15 రోజుల కాలపరిమితిలోగా తెలియపరచవలెను. లేని పక్షంలో నా క్లైయింటు గారు క్రయ దస్తావేజు చేసుకుంటారని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

షెడ్యూలు

విశాఖపట్నం జిల్లా, విశాఖపట్నం బస్తీ, మధురవాడ సబ్-రిజిస్ట్రార్ ఆఫీస్ మరియు జి.వి.యం.సి పరిధి, ఎండాడ గ్రామం దరి, విశాఖపట్నం రూరల్ మండలం, సర్వే నెంబరు 40 మరియు 41/2, బ్లాక్ నెం.1, రామరాజు నగర్‌లో డోరు నెం. 3-438/2, MVV Harmony Apartment, 2వ ఫ్లోరు, ఫ్లాట్ నెం. 304రు మొత్తం 2019 చ॥గు॥ల విస్తీర్ణంలో అవిభక్తపు వాటా 53 చ॥గు॥ (1030 చ॥అ॥) గల ఫ్లాటుకు గల హద్దులు : **తూర్పు**: బల్లెమ్మ గారి స్థలం, **దక్షిణం** : బల్లెమ్మ గారి స్థలం, **పడమర** : కె.కృష్ణచంద్ గారి స్థలం మరియు 30 అడుగుల రోడ్డు, **ఉత్తరం** : మురళీ గారి స్థలం.

S.V.RATNAKARA RAO, Advocate & Notary,
D.No.22-23-8, Kanchara Street, Visakhapatnam.
Cell : 9346333998, 9030533998

కాన్ఫరెన్స్ అధ్యక్షుడిగా సుదర్శనరావు



ఆచార్య సుదర్శనరావు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం అర్థశాస్త్ర విభాగం విశ్రాంత ఆచార్యుడు ఆర్.సుదర్శనరావు ఏపీ ఎకనామిక్ అసోసియేషన్ కాన్ఫరెన్స్ ప్రెసిడెంట్‌గా నియమితులయ్యారు. ఈ నెల 27, 28 తేదీలలో తిరుపతి ఎస్‌వీ విశ్వవిద్యాలయంలో నిర్వహించే 39వ వార్షిక సదస్సులో ఆయన అధ్యక్షోపన్యాసం చేయనున్నారు. సదస్సులో మూడు ప్రధాన అంశాలపై చర్చించనున్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో ఆర్థిక వృద్ధి, నూతన విద్యా విధానం, రాయలసీమ ప్రాంతంలో ఆర్థిక ప్రగతి అనే అంశాలపై సదస్సులో విస్తృతంగా చర్చిస్తారు. ఈ సందర్భంగా ఆచార్య సుదర్శనరావును విభాగ ఆచార్యులు, పరిశోధకులు అభినందించారు.

గీతాభవన్‌లో నక్షత్రమాల



కృష్ణ భగవానునికి పూజలు చేస్తున్న అతిథులు

దాబాగార్డెన్స్: గీతా ప్రచార సమితిని ప్రారంభించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా లోక కల్యాణార్థం నక్షత్రమాల పేరిట 27 నక్షత్రాలకు.. 27 సార్లు భక్తులందరిచే సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణ నిర్వహించారు. ముందుగా గీతా మందిరంలో వేంచేసిన విశ్వరూప సహిత శ్రీకృష్ణార్జున ప్రతిష్ఠ మూర్తులకు, గోసహిత శ్రీకృష్ణ భగవానుని ఉత్సవమూర్తికి ప్రత్యేక పూజలు జరిపారు. ఆధ్యాత్మిక ఉత్సవంలో పాల్గొన్న బ్రహ్మశ్రీ మురళీకృష్ణ భక్తులనుద్దేశించి ప్రసంగిస్తూ శ్రీవిష్ణు సహస్రనామ పారాయణం వల్ల విశ్వశాంతి కలగడమే గాక పాల్గొన్న వారందరికీ శుభాలు కలుగుతాయని అభిలషించారు. గీతా ప్రచార సమితి గత 50 ఏళ్లుగా నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక ఉత్సవాలను ఆయన ప్రశంసించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ప్రచార సమితి గౌరవ అధ్యక్షుడు వై. కృష్ణమూర్తి, అధ్యక్షుడు సీహెచ్ విశ్వేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి జగన్‌మోహన్‌రావు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, కార్యదర్శి ఎం. వనజాదేవి, జీవీఆర్ ప్రసాద్, లక్ష్మీనరసింహం తదితరులు పాల్గొన్నారు.